దైవ దర్శనానికి వెళ్లి తిరిగి వస్తూ..

- చౌటకూర్ జాతీయ రహదారిపై ఇన్నోవా కారు బోల్తా
- మూడేళ్ల చిన్నారి మృతి, మరో ఆరుగురికి గాయాలు



మృతి చెందిన చిన్నారి, గాయపడిన లక్ష్మి, ధ్వంసమైన ఇన్నోవా కారు

పుల్‌కల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): దైవ దర్శనానికి వెళ్లి వస్తూ టైరు పగిలి ఇన్నోవా కారు బోల్తా పడిన సంఘటనలో ఓ చిన్నారి మృతి చెందగా, మరో ఆరుగురికి గాయాలయ్యాయి. మండల కేంద్రమైన చౌటకూర్‌కు సమీపంలో సంగారెడ్డి-నాందేడ్, అకోలా 161 జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారు జామున ఈ సంఘటన జరిగింది. పుల్కల్ ఎస్‌ఐ ఎన్.విశ్వజన్ వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని సంజీవరెడ్డినగర్ ప్రాంతం శ్రీరాంనగర్ కాలనీకి చెందిన తాళ్ల గౌతమ్‌గౌడ్ తన భార్య, ఇద్దరు పిల్లలు, తల్లీదండ్రులు, డ్రైవర్‌తో కలిసి ఈ నెల 14న ఇన్నోవా కారులో షిర్డీ యాత్రకు వెళ్లారు. ఇంటికి వెళ్లేందుకు తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో శుక్రవారం తెల్లవారు జామున 4 గంటలకు సంగారెడ్డి-నాందేడ్, అకోలా 161 జాతీయ రహదారిపై చౌటకూర్ శివారులోకి రాగానే కారు వెనుకభాగంలోని ఎడమ వైపు టైరు పగిలింది. దీంతో కారు అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈ ఘటనలో గౌతమ్‌గౌడ్‌తో పాటు వాహనంలోని వారందరికీ గాయాలయ్యాయి. గాయపడిన వారిని ఎన్‌హెచ్‌ఏఐ అంబులెన్స్‌లో సంగారెడ్డి ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి తరలించారు. కాగా, గౌతమ్‌గౌడ్ మూడేళ్ల కూతురు శ్రీతకు బలమైన మూగ దెబ్బలు తగలడం వల్ల మృతి చెందిందని డాక్టర్లు ధృవీకరించారు. మిగిలిన వారందరూ గాయాలతో బయటపడ్డారు. చిన్నారి మృతదేహానికి సంగారెడ్డి ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. గౌతమ్‌గౌడ్ ఫిర్యాదు మేరకు పుల్కల్ ఎస్‌ఐ విశ్వజన్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



స్టాల్‌లో చీరను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల, డోలు వాయిస్తూ..

చేనేత కళాకారులకు అండగా ఉంటాం: మంత్రి

హైటెక్ సిటీ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం చేనేత కళాకారులకు ఎల్లప్పుడూ అండగా ఉంటుంద ని అగ్రికల్చర్ మార్కెటింగ్, హేండ్లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. శుక్రవారం మాదాపూర్‌లోని శిల్పారామంలో మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్, డెవలప్‌మెంట్ ఆఫ్ కమిషనర్ ఫర్ హేండ్లూమ్స్ ఆధ్వర్యంలో 'మైహేండ్లూమ్ మై ప్రైడ్' పేరుతో ఏర్పాటు చేసిన హత్కర్గా మేళాను ఆయన ప్రారంభించారు. అక్టోబరు 2 వరకు జరిగే మేళాలో 19 రాష్ట్రాలకు చెందిన చేనేత హస్తకళా ఉత్పత్తులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా మంత్రి ప్రతి స్టాల్‌ను సందర్శించి వాటి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డోలు వాయిస్తూ మంత్రి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కార్యక్రమంలో టెక్స్‌టైల్స్ రీజినల్ డైరెక్టర్ అరుణ్ కుమార్, అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, మిస్ ఏషియా ఇంటర్నేషనల్ ఇకత్ బ్రాండ్ అంబాసిడర్ రష్మి ఠాకూర్ పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాలకు రండి..

శ్రీనగర్‌కాలనీ వేంకటేశ్వరస్వామి దేవాలయం బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని మంత్రి సీతక్కకు ఆహ్వాన పత్రిక అందచేస్తున్న ట్రస్టు బోర్డు సభ్యులు - బంజారాహిల్స్, (ఆంధ్రజ్యోతి)



నాలాను పరిశీలిస్తున్న మంత్రి వివేక్‌వెంకటస్వామి, నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

నాలా సమస్యను పరిష్కరిస్తాం: మంత్రి వివేక్

బంజారాహిల్స్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): నాలా సమస్యను శాశ్వత ప్రాతిపాదికన పరిష్కరించేందుకు కృషి చేయనున్నట్టు రాష్ట్ర కార్మిక, ఉపాధి, భూగర్భ గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. షేక్‌పేట డివిజన్ విరాట్‌నగర్, మినీ బృందావనం, హకీమ్‌కాలనీలలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ముంపునకు గురైన ప్రాంతాలను శుక్రవారం వారు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. స్థానికులనడిగి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు వరద ముంపు బాధల నుంచి శాశ్వత విముక్తి కల్పిస్తామన్నారు. ప్రజలు ధైర్యంగా ఉండాలని ముంపు బాధిత ప్రజలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు.

అక్కా.. తమ్మీ బాగున్నరా?

- వరుసలు కలుపుతూ బస్తీల్లో నేతల పాదయాత్ర
- పట్టు నిలుపుకునేందుకు ఆశావహుల పాట్లు
- మురికివాడల్లో మొదలైన హడావుడి
- తారాస్థాయికి చేరిన ఉప ఎన్నికల సందడి



బంజారాహిల్స్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): అర్రె.. గిదేందక్కా.. మంది అందరూ మన బస్తీలకే వస్తున్రు. ఎలచ్చన్ల గట్ల ఉన్నయా ఏందీ. ఆ పెద్దాయన.. అదే ఆ కండవాతో పోయినేడు వచ్చిండు. మల్లా గిప్పుడే చూత్తన్నా. మళ్లీ ఆయనే నిలబడతండా ఏందీ.. ఇదీ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కొందరికి వస్తున్న అనుమానం. బస్తీలన్నీ రాజకీయపార్టీల జెండాలతో రెపరెపలాడుతున్నాయి. పండుగల సీజన్ ముహూర్తం బావుందని జ్యోతిష్యులు చెప్పిందే తడవుగా.. బడానేతల నుంచి చోటా నాయకుల వరకూ అందరూ బస్తీబాట పట్టారు. సందట్లో సడేమియా అన్నట్లు.. ఎక్కడ సీటుకు ఎసర పెడతారేమోననే భయంతో.. కొందరు ఖద్దరు నేతలు, పగలూ రాత్రి అక్కడే పాగా వేస్తుండటం గమనార్హం. మంత్రుల నుంచి మాజీ కార్పొరేటర్ల వరకూ అందరిదీ ఒకటే దారి.

అందరూ అక్కడే

ప్రధాన రాజకీయ పార్టీలు మురికివాడలు, బస్తీల ఓట్లనే లక్ష్యంగా చేసుకొని ఎన్నికల బరిలో దిగుతున్నాయి. వేల కొద్ది ఓట్లు ఉన్న బస్తీలో అన్ని పార్టీలు మోహరిస్తున్నాయి. ఎడాపెడా పాదయాత్రలు నిర్వహిస్తూ తెలిసిన సమస్యలనే మళ్లీ స్థానికులనడిగి తెలుసుకుంటున్నారు. గెలిచిన వెంటనే బస్తీలో సమస్యలను పరిష్కరిస్తానని హామీలు గుప్పిస్తున్నారు. సమస్య పరిష్కారం తెలియకపోయిన ఏదోలా తీర్చేస్తామంటూ వాగ్దానాలు చేసేస్తున్నారు. ఉదాహరణకు కృష్ణానగర్ వరద నీటి సమస్య.. ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వర్షపు నీటి సమస్య ఎలాగైన పరిష్కరిస్తానంటూ ఓ నేత హామీలు గుప్పించారు. అయితే వాస్తవానికి ఈ సమస్య ఇరవై ఏళ్లుగా స్థానికులను వేదిస్తోంది. కాని ఇవన్నీ తెలియక సదరు నేత మాత్రం గెలిచిన నెలకే పరిష్కరిస్తా అని హామీ ఇవ్వడంతో బస్తీ వాసులు విస్తుపోయారు.

రహస్య సమావేశాలు

ఉదయం అంతా టికెట్ల కోసం అధిష్టానం చుట్టూ తిరగటం, సీనియర్‌లను కలుసుకోవడం, బస్తీల్లో పాద యాత్రలు నిర్వహిస్తున్న నేతలు రాత్రి కాగానే పోలింగ్ బూత్ జాబితాలను ముందర వేసుకొని ఎక్కడెక్కడ తమకు ఓట్లు పడతాయని అంచనా వేస్తున్నారు. దీని ప్రకారం తమకు అనుకూలంగా ఉన్న ఓటు బ్యాంకులను సురక్షితంగా ఉంచుకునేందుకు సంక్షేమ సమితిలతో చర్చలు జరుపుతున్నారు. దీంతో పాటు ఇతర పార్టీ ఓట్లను కూడా దండుకునేందుకు సమాయత్తమవుతున్నారు. బస్తీల్లో కీలకంగా ఉన్న యువతను చేరదీసి వారికి స్పోర్ట్స్ కిట్‌లను రహస్యంగా అందచేస్తున్నారు. తమ పార్టీ కోసం పనిచేయాలంటూ నిర్దేశిస్తున్నారు.

ముహూర్తం కుదిరింది

ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో ఉప ఎన్నిక లు అనివార్యమయ్యాయి. దీంతో అశావహులంతా ఎలాగైన బరిలో దిగాలని ఉవ్విళ్లూరుతున్నారు. బస్తీల్లో ప్రచారం నిర్వహించుకునేందుకు నేతలు అవకాశం కోసం ఎదురుచూస్తున్నారు. ఇంతలో వినాయక చవితి రావడంతో వారి ప్రచారానికి ఆస్కారం ఏర్పడింది. అంతగా పరిచయం లేని నేతలు కూడా తమకే టికెట్టు వస్తుందని మండప నిర్వాహకులను పిలిచి మరీ చెందా ఇచ్చారు. తమను పిలిచి సత్కారం చేయాలని కండీషన్‌లు పెట్టారు. ఈ తరుణంలో నేతల బ్యానర్ల హంగామా ప్రత్యేకంగా చెప్పుకోనవసరం లేదు. ఇక ఇప్పుడు నవరాత్రి, బతుకమ్మ వేడుకలను తమకు అనుకూలంగా మార్చుకునేందుకు నేతలు హడావుడి మొదలు పెట్టారు. ముఖ్యంగా బతుకమ్మలతో మహిళల అభిమానాన్ని చూరగొనాలని చేస్తున్న విన్యాసాలు అంతా ఇంతా కాదు. డివిజన్‌కు ఓ రోజు చొప్పున బతుకమ్మను నిర్వహించేందుకు ఎవరికి వారు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇందుకోసం మైదానాలు, ఫంక్షన్ హాల్‌ను బుక్ చేసుకుంటున్నారు. మహిళలకు లారీల కొద్ది బహుమతులు ఇచ్చేందుకు సిద్ధం చేసుకుంటున్నారు.

టిక్కట్టే అసలు గుబులు

ఓ పక్క ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు నేత లు విన్యాసాలు చేస్తున్నప్పటికి మరో వైపు టికెట్టు అంశం వారి గుండెల్లో గుబులు రేపుతోంది. ప్రధాన పార్టీల్లో టికెట్టు విషయం తీవ్ర పోటీ నెలకొంది. అధిష్ఠానం ఎవరి వైపు మొగ్గు చూపిస్తుంది అనేది అంతుచిక్కని అంశంగా మారింది. అశావహులందరికి మాత్రం టికెట్టు తమకే వస్తుందని ప్రగాల్భాలకు పోతున్నప్పటికి భవిష్యత్తు ఎందో తెలియక లో లోపల కుమిలిపోతున్నారు. పరిస్థితి చూస్తుంటే వీరి టెన్షన్ ఇంకా రెండు వారాల పాటు కొనసాగేలా కనిపిస్తుంది.

వరుసలు కలిపేస్తున్నారు..

అమ్మా బాగున్నావా.. ఆరోగ్యం ఎట్లుంది..పెద్దాయన, తమ్ముడు వదినమ్మ బాగున్నారా.. గీసారి ఎన్నికల్లో నాకే ఓటు ముద్ర వేయాలే అంటూ నేతలు వరసలు కలిపి మరీ ప్రచారం నిర్వహిస్తున్నారు. అన్నా, భావ, తమ్ము డు, అక్కా వదిన, అవ్వా తాత, అమ్మా అంటూ కలిసిన వారిని వరుసలు పెట్టి పిలుస్తున్నారు. సమస్యలేమన్నా ఉంటే చెప్పండి విజ్ఞప్తి చేస్తున్నారు. ఇదే క్రమంలో తమ పార్టీ గుర్తు చెబుతూ ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు.అలాగే సర్వే సంస్థలకు తమ పేర్లే చెప్పాలని కోరుతున్నారు.

'అమ్మ' ఆవిష్కరణ



తమిళ రచనకు తెలుగు అనువాదం 'అమ్మ' పుస్తకావిష్కరణ సభలో మురుగన్, ఆదిత్య , లక్ష్మణ్ ఏలే, గీతా రామస్వామి, కుప్పిలి

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): 'నేను పుస్తకాలు చదవడం మొదలుపెట్టిన తర్వాత, ఆ పుస్తకాల్లోని వాటి కంటే అత్యంత ఆసక్తికరమైన, కీలకమైన విషయాలు, విశేషాలు నా జీవితంలోనే ఉన్నాయ ని గ్రహించాను.. నా జీవితానుభవాలను రాయాలని నిర్ణయించుకున్నాను' అని ప్రఖ్యాత తమిళ రచయిత పెరుమాళ్ మురుగన్ చెప్పారు. రచయిత జీవితానుభవాలే వారి రచనలకు బలమని అన్నారు. అయన తమిళంలో రాసిన 'తోండ్ర తునై కాలచువడు' పుస్తకాని కి అరుణా ప్రసాద్ తెలుగు అనువాదం 'అమ్మ' ఆవిష్కరణ సభ శుక్రవారం బంజారాహిల్స్‌లోని లామాకాన్‌లో జరిగింది. హైదరాబాద్ బుక్ ట్రస్టు నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పెరుమాళ్ ప్రేక్షకులతో సంభాషించారు. ఉద్వేగాలకు అతీతమైన జ్ఞాపకాలు, సున్నితమైన హాస్యంతో కలగలసిన ఈ రచన తమిళనాడులోని కొంగు ప్రాంతం రైతుల జీవితాలను పరిచయం చేస్తుందని వివరించారు. తెలుగు పుస్తకానికి లక్ష్మణ్ ఏలే గీసిన ముఖ చిత్రం తనను ఎంతో ఆకట్టుకుందని చెప్పారు. అనువాదకురాలు అరుణ ప్రసాద్‌కు, ప్రచురణ కర్త గీతారామస్వామికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆదిత్య కొర్రపాటి, కుప్పిలి పద్మ, లక్ష్మణ్ ఏలేతో పాటు పెద్ద సంఖ్యలో మురుగన్ అభిమానులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే తలసానికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఈవో జయంతి

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు రండి

అమీర్‌పేట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అమీర్‌పేట హనుమాన్ ఆలయంలో ఈ నెల 22 నుంచి అక్టోబర్ 2 వరకు హనుమాన్ దేవస్థానం ప్రాంగణంలో ఉన్న ఆది పరాశక్తి శ్రీ రాజరాజేశ్వరీ అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలకు రావాలని కోరుతూ శుక్రవారం మాజీ కార్పొరేటర్ శేషుకుమారి, ఆలయ అర్చకులతో కలిసి కార్యనిర్వహణాధికారి జయంతి సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను ఆయన నివాసంలో ఆహ్వాన పత్రికను అందజేశారు. ఇందుకు సానుకూలంగా తలసాని స్పందించారు.

పోలీసుల అదుపులో 'గాంజా' యువకులు

యూసుఫ్‌గూడ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయించడంతో పాటు సేవిస్తున్న యువకులను అదుపులోకి తీసుకున్న సంఘటన శుక్రవారం మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ శివశంక ర్ వివరాల ప్రకారం.. యూసుఫ్ గూడా చౌరస్తాలోని చైనా బజార్ వద్ద గంజా యి సేవిస్తున్నారని తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించిన వారిని అదుపులోకి తీసుకొని విచారించగా గంజాయిని విక్రయిస్తున్నట్టు ఒప్పుకున్నారు. వారి వద్ద 125 గ్రాముల గంజాయిని, ప్యాకింగ్ కవర్‌తో పాటు రెండు సెల్ ఫోన్ లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

పిల్లలతో మహిళ అదృశ్యం

యూసుఫ్‌గూడ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు పిల్లలతో కలిసి మహిళ అదృశ్యమైన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. యూసుఫ్ గూడకు చెందిన వి.వెంకట్రావు డ్రైవర్. ఈ నెల 16న ఆఫీస్‌కు వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చే వరకు పిల్లలు, భార్య లేదు. ఫోన్ స్విచ్ ఆఫ్ ఉంది. శుక్రవారం వెంకట్రావు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.



నారీమణి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శైలజారెడ్డి

చేనేత వస్త్రాలను ప్రోత్సహించుకోవాలి

బంజారాహిల్స్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతి-సాంప్రదాయాలలో మహిళల చీరకట్టుకు ప్రత్యేక స్థానం ఉందని, మన చేనేతకళలను ప్రోత్సహించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలంగాణా వేర్ హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ కే.లక్ష్మి అన్నారు. శుక్రవారం శ్రీనగర్ కాలనీలోని సత్యసాయినిగమాగమంలో ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఆధ్వర్యంలో చేనేతకళలను ప్రోత్సహించేందుకు మహిళలను నారీమణి-2025 పేరిట నిర్వహిస్తున్న కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ను ఆమె నగర ఎంటర్‌ప్రినర్ శైలజారెడ్డితో కలిసి ఆవిష్కరించారు.

విజయవంతంగా ఊపిరితిత్తుల మార్పిడి శస్త్ర చికిత్సలు



మాట్లాడుతున్న గ్లెనిగల్స్ ఆస్పత్రి ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్ బాల సుబ్రమణ్యం గోవిని, డా.కృష్ణ తదితరులు

ఖైరతాబాద్, సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి): కేవలం 15 రోజుల వ్యవధిలోనే అత్యంత క్లిష్టపరిస్థితుల్లో ఉన్న ముగ్గురు రోగులకు గ్లెనిగల్స్ ఆస్పత్రుల్లో ఊపిరితిత్తుల మార్పిడి శస్త్ర చికిత్సలను విజయవంతంగా చేశామని వైద్యులు తెలిపారు. శుక్రవారం లక్డీకాపూల్‌లోని గ్లెనిగల్స్ ఆస్పత్రిలో విలేకరుల సమావేశంలో లీడ్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్ డాక్టర్ బాలసుబ్రమణ్యం గోవిని ట్రాన్స్‌ప్లాంట్స్ ప్రోగ్రాం డైరెక్టర్ అపర్ జిందాల్, పల్మనాలజిస్ట్ తపస్వీ కృష్ణతో పాటు బృంద వైద్యులు, అధికారులతో కలసి వివరాలను వెల్లడించారు. ఇదే బృందం 15 రోజుల్లో హైదరాబాద్, చెన్నై, బెంగళూరులోని గ్లెనిగల్స్ ఆస్పత్రుల్లో 3 ఊపిరితిత్తుల మార్పిడి శస్త్ర చికిత్సలను చేసిందన్నారు.

కాలేయ మార్పిడి శస్త్ర చికిత్సల అనంతరం టీబీతో ఊపిరితిత్తుల్లో తీవ్ర సమస్య సోకి ఎల్లవేళలా ఆక్సిజన్ పెట్టుకునే స్థాయిలో ఉన్న వీరికి విజయవంతంగా చికిత్సలు చేశామన్నారు. హైదరాబాద్‌లో చికిత్స చేసిన రోగికి దాత ఏపీలోని శ్రీకాకుళంలో లభించగా అక్కడి నుంచి కేవలం 7 గంటల వ్యవధిలో ఊపిరితిత్తుల మార్పిడి శస్త్ర చికిత్స చేయాల్సి ఉండగా 4 గంటల్లో విమానంలో తెచ్చి ఎయిర్‌పోర్టు నుంచి ఆస్పత్రి వరకు ఎమర్జెన్సీ ట్రాన్స్‌పోర్టు ద్వారా తెప్పించి సమయంలో ముగింపజేశామన్నారు. తమ వద్ద నిపుణుల బృందం, సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన యంత్రాలవల్లే ఇవి సాధ్యమయ్యాయన్నారు. ముగ్గురు రోగులు ఆక్సిజన్ లేకుండా జీవనాన్ని కొనసాగించాలనే తలంపుతోనే ఈ శస్త్ర చికిత్సలకు సాహసం చేశామని డాక్టర్ తపస్వీ కృష్ణ అన్నారు. అవయవ మార్పిడి శస్త్ర చికిత్సల్లో గ్లెనిగల్స్ ఆస్పత్రులు దేశంలోనే ముందంజలో ఉన్నాయని పేర్కొన్నారు.

వ్యవసాయ కూలీ ఆత్మహత్య



మృతుడు మల్లేష్

అమీర్‌పేట్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): స్వగ్రామం వదిలి నగరానికి వచ్చిన ఓ వ్యవసాయ కూలీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తీగలను తాకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఎస్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. నిజామాబాద్ జిల్లా మక్లూర్ మండలం, ముత్యంపల్లి గ్రామానికి చెందిన మల్లేష్(40) గ్రామం లో వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నాడు. అయితే ఇటీవల పనులు లేకపోవడంతో కుటుంబ సభ్యులకు చెప్పి 10 రోజుల కిందట నగరానికి వచ్చాడు. ఏ పని దొరకకపోవడంతో శుక్రవారం అమీర్‌పేట్ ధరం కరం రోడ్డులోని అతిథి ఇన్ హోటల్ సమీపంలో గల ట్రాన్స్‌ఫార్మర్ పైకి ఎక్కాడు. తీగలను పట్టుకోవడంతో పెద్ద శబ్దంతో షాక్‌తో కిందపడ్డాడు. పోలీసులు హుటాహుటిన గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ రెడ్డి తెలిపారు.

ఇళ్లలోకి వరదనీరు.. సివరేజీ అధికారుల నిర్లక్ష్యమే

సనత్‌నగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి డా. కోట నీలిమ



వరద బాధితులకు ఆహారం అందజేస్తున్న కోట నీలిమ

బేగంపేట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బేగంపేటలోని బ్రాహ్మణవాడి, వడ్డెర బస్తీ వాసులు వరద ముంపుతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు ఈ ప్రాంతంలో సహాయక చర్యలు తీసుకోక పోవడం దారుణమని సనత్‌నగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి డా.కోట నీలిమ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం పార్టీ నాయకులతో కలిసి ఆమె బ్రాహ్మణవాడి, వడ్డెర బస్తీలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఇళ్లలోకి నీరు వచ్చిన వారికి ఆహార ప్యాకెట్లను అందజేశారు. ఆమె మాట్లాడుతూ సమస్య తీవ్రంగా ఉన్నా సివరేజీ అధికారులు ఇటు వైపు రాక పోవడం దారుణమన్నారు.

మహాజనసేన పార్టీ ఏర్పాటు

పంజాగుట్ట, సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఎస్సీఎస్టీ, బీసీ వర్గాలకు రాజ్యాధికారం సాధించడమే తమ పార్టీ లక్ష్యంగా నూతనంగా 'మహాజన సేన పేరుతో పార్టీ'ని ఏర్పాటు చేసినట్లు పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు తీగల ప్రదీప్ గౌడ్ అన్నారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో పార్టీ ఆవిర్భావ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన పార్టీ జెండాను, లోగోను ఆవిష్కరించి, పార్టీ విధివిధానాలు, లక్ష్యాలు, ఆశయాలను ఆయన వివరించారు.

గృహ కార్మికులకు కనీస వేతనం అందించాలి

● డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్పన

అడ్డగుట్ట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గృహ కార్మికులకు కనీస వేతనం అందక శ్రమ దోపిడికి గురవుతున్నారని, వారికి కనీస వేతనం అందేలా ప్రభుత్వాలు చొరవ చూపాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన డిమాండ్ చేశారు. శుక్రవారం తుకారాంగేట్‌లో నిర్వహించిన గృహ కార్మికుల సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గృహ కార్మికులకు కనీస వేతనాలు అందకపోవడంతో ఇంటి కిరాయిలు, పిల్లల చదువులు, కుటుంబ పోషణ భారంగా మారిందని అన్నారు. గృహ కార్మికులకు ఒక రోజు సెలవు ఇవ్వాలని, బీమా సౌకర్యం కల్పించాలని కల్పన అన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు ఉమ, ఐశ్వర్య తదితరులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● కార్పొరేటర్ శైలజ


లోతట్టు ప్రాంత ప్రజలతో మాట్లాడుతున్న కార్పొరేటర్ శైలజ

బౌద్ధనగర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వర్షాలు, వరదల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కార్పొరేటర్ కంది శైలజ సూచించారు. బౌద్ధనగర్ డివిజన్‌లోని లోతట్టు ప్రాంతాల్లో శుక్రవారం డీసీ ఆంజనేయులు, జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ డీఈ తిరుపతి, ఏఈ లావణ్యలతో కలిసి కార్పొరేటర్ పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, బస్తీలో ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకరావాలని, అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో శానిటేషన్ డీఈ వెంకటేష్, హైడ్రా సిబ్బంది, బీఆర్ఎస్ నాయకులు రాజేష్, సాయి, వినోద్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


వీధులను శుభ్రం చేస్తున్న మాజీ కార్పొరేటర్, బీజేపీ నాయకులు

ముంపు ప్రాంతాల ప్రజలను ఆదుకోవాలి

● మాజీ కార్పొరేటర్ స్వరూప

బౌద్ధనగర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ముంపు ప్రాంతాల ప్రజలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్ కోరారు. సేవా పక్షం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం బౌద్ధనగర్ డివిజన్‌లోని ఎల్ నారాయణనగర్, పార్శిగుట్ట, న్యూ అశోక్‌నగర్ బస్తీల్లో స్వచ్ఛ భారత్ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వర్షానికి చాలా మంది ఇళ్లలోకి నీరు చేరిందని, వారికి ప్రభుత్వం వెంటనే ఆహార పదార్థాలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు సాయి ప్రసాద్ గౌడ్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిప్రసాద్‌గౌడ్, దత్తు, శ్యాంసుందర్, సుధాకర్, లింగం, నాగరాజు, వెంకటేష్, జయంత్, సుబ్బారావు, శ్రీనివాస్, దీపక్, సురేష్, మహ్మద్, అమరావతి, సరిత, పార్వతమ్మ, శారద బస్తీవాసులు పాల్గొన్నారు.


బాధిత మహిళకు ఎల్ఓసీ పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి

ఇద్దరికి ఎల్ఓసీ అందజేత

అడ్డగుట్ట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఇద్దరికి శుక్రవారం అడ్డగుట్ట కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి సీఎంఎల్ఓసీ అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, ఆరోగ్య విషయంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అడ్డగుట్ట సీ సెక్షన్ ప్రాంతానికి చెందిన సుగుణ వెన్నునొప్పితో, శాంతినగర్‌కు చెందిన మహ్మద్ మన్సూర్‌అక్రమ్ కిడ్నీ సమస్యతో బాధపడుతున్నారని అన్నారు. ఎమ్మెల్యే పద్మారావు సహకారంతో ఒక్కొక్కరికి రూ.రెండు లక్షల సీఎం ఎల్ఓసీ అందజేసినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు లింగాని శ్రీనివాస్, నరేష్, దేవయ్య, సంతోష్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

సీఐకి సన్మానం



తిరుమలగిరి ట్రాఫిక్ సీఐ మధుబాబును అధికారులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. మధుబాబు చిలకలగూడ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో సర్దార్ నాయక్ పదవి బాధ్యతలు స్వీకరించారు. సీఐని సన్మానించిన వారిలో అడిషనల్ ఇన్‌స్పెక్టర్ పరదేశిజాన్, ఎస్ఐలు శ్రీధర్‌రెడ్డి, యుగేందర్‌రెడ్డి, మారుతినాయక్, ఏఎస్ఐ రెడ్డి నాయక్ తదితరులు ఉన్నారు.

- తిరుమలగిరి, (ఆంధ్రజ్యోతి)

విద్యుత్ స్తంభం తొలగించండి



కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మెట్టుగూడ బాలాంజనేయ స్వామి ఆలయం వద్ద గల విద్యుత్ స్తంభం మూడు రోజుల క్రితం పడిపోయింది. ఎటువంటి ప్రాణహాని జరగలేదు. దీంతో ట్రాఫిక్‌కు ఇబ్బందవుతుంది. మూడు రోజులవుతున్న స్తంభం తొలగించకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే విద్యుత్ శాఖ సిబ్బంది స్పందించి స్తంభాన్ని తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

- చిలకలగూడ, (ఆంధ్రజ్యోతి)

సూపర్ మార్కెట్లలో కాలం చెల్లిన వస్తువులు



సూపర్ మార్కెట్‌లో తనిఖీలు నిర్వహిస్తోన్న ఫుడ్‌సేఫ్టీ అధికారులు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లోని పలు సూపర్ మార్కెట్లలో జీహెచ్ఎంసీ ఫుడ్‌సేఫ్టీ అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. 44 మార్కెట్లలో తనిఖీలు నిర్వహించి.. పరీక్షల నిమిత్తం 58 నమూనాలను నాచారంలోని రాష్ట్ర ఫుడ్ లేబరేటరీకి పంపారు. సైదాబాద్‌లోని మోర్ రిటైల్ ప్రైవేట్ లిమిటెడ్‌లో గడువు ముగిసిన యాపిల్ ప్యాక్, కాచిగూడ ఎక్స్ రోడ్డులోని రిలయన్స్ లిమిటెడ్‌లో గడువు ముగిసిన అవకాడో, యాపిల్, ఆరెంజ్ ప్యాక్‌లు, కొండాపూర్‌లోని విజేత సూపర్ మార్కెట్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఎల్లో రింగ్స్, పాలక్ రైస్ పాపడ్, గోద్రెజ్ జెర్సీ థిక్‌షేక్, కొండాపూర్ రాజరాజేశ్వరనగర్‌లోని కేపీఎస్ ఫ్రెష్ ప్రైవేట్ లిమిటెడ్‌లో అంబికా హోం ఫుడ్స్‌కు చెందిన డ్రైఫ్రూట్ పూత రేకులు, చక్కెర గవ్వలు, బెల్లం సున్నుండలు, ఎనిమిది గ్రీన్ యాపిల్, కొండాపూర్‌లోని రత్నదీప్ సూపర్ మార్కెట్‌లో దీపిక జున్ను, స్వీట్ కార్న్, కలర్ క్యాప్సికమ్ మిక్స్ ప్యాకెట్లు గుర్తించారు. ఉల్లంఘనలకు పాల్పడినందుకు ఆయా సంస్థలకు నోటీసులు జారీ చేసినట్టు జీహెచ్ఎంసీ ఒక ప్రకటనలో పేర్కొంది.

అతలాకుతలం..!


చుట్టాల బస్తీలోని ఓ ఇంట్లోకి వచ్చిన వరద నీరు

● రాంగోపాల్‌పేట్‌లో మునిగిన పలు బస్తీలు
● అడ్డగుట్టలో దెబ్బతిన్న రోడ్లు, డ్రైనేజీ
● ఇబ్బందులు పడిన ప్రజలు


నల్లగుట్టలో నీట మునిగిన దేవాలయం

రాంగోపాల్‌పేట్/ అడ్డగుట్ట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు రాంగోపాల్‌పేట్, అడ్డగుట్ట డివిజన్లలోని పలు బస్తీలు నరకయాతను అనుభవిస్తున్నాయి. నాలా పరివాహక ప్రాంతాలలో నివసించేవారికి కంటినిండా నిద్రలేకుండా పోతుంది. భారీ వర్షాలకు రోడ్లు దెబ్బతినడం, డ్రైనేజీలు పొంగి పొర్లడంతో స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం పడితే భయం గుప్పిట్లో బతకాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు.

రాంగోపాల్‌పేట్‌లో..

రాంగోపాల్‌పేట్‌లో బుధ, గురువారాలలో కురిసిన కుంభవృష్టికి చుట్టాల బస్తీ, నల్లగుట్ట జే లైన్, కాచీబౌలీ, వెంగళరావునగర్‌లలోని నాలా పరివాహక ప్రాంతాల ఇళ్లలోకి వరద నీరు చేరింది. దీంతో ఇంట్లో ఉన్న నిత్యవసర సామగ్రితో సహా సామాన్లు నీట మునిగాయి. నాలాల్లో ఎప్పటికప్పుడు సిల్ట్‌ను తీయకపోవడం ఓ కారణమైతే.. ఎక్కడికక్కడ నాలాల ఆక్రమణలు మరో కారణం. రెజిమెంటల్ బజార్ నుంచి వచ్చే నాలా కళాసిగూడలో పదిహేను మీటర్లు ఉండగా అది కాస్తా హైడ్రా పోలీస్‌స్టేషన్ వద్దకు వచ్చే సరికి 3 మీటర్లకు కుచించుకుపోయింది. ఇప్పటికైనా నాలాలను ఆక్రమణదారులన ఉంచి రక్షించడంతో పాటు సిల్ట్‌ను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

అడ్డగుట్టలో..

రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో అడ్డగుట్ట డివిజన్ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అడ్డగుట్టలోని మసీదు వద్ద మ్యాన్‌హోల్ నుంచి మురుగు నీరు రోడ్డుపై పారుతుంది. మారేడుపల్లి గీతా నర్సింగ్ ఎదురుగా ప్రధాన రోడ్డులో ఏడాది క్రితం రోడ్డు పగిలిపోయి మట్టి తేలి వర్షం పడిన సమయంలో ట్రాఫిక్‌కు ఇబ్బందవుతుంది. మారేడుపల్లి ఏటీసీ సెంటర్ నుంచి సికింద్రాబాద్ వైపు వచ్చే వాహనాలు ఈ రోడ్డు మీదుగా వెళ్లాలంటే భయపడుతున్నారు. లోహియనగర్‌లోనూ నాలాలోని నీరు ఇళ్లలోకి చేరుతుంది. ఆజాద్ చంద్రశేఖర్‌నగర్ రోడ్లన్ని జలమయం కావడంతో బస్తీలు వాసులు బయటకు రావడానికి ఇబ్బందులు పడుతున్నారు. బస్తీలోని రామాలయం వెనుక వైపు ఉన్న సెప్టిక్ ట్యాంక్ కూలిపోవడంతో బస్తీవాసులు భయపడ్డారు.

నిత్యావసర సరుకులు నీట మునిగాయి



బుధ, గురువారాలలో కురిసిన భారీ వర్షాలకు ఇంటిలోకి నాలుగు అడుగుల మేర నీరు వచ్చింది. దీంతో నిత్యావసర సరుకులు నీట మునిగాయి. నిత్యం వాడే మందులు కూడా పాడైపోయాయి. ఎలా బతకాలో అర్థం కావడం లేదు. ప్రభుత్వం తగిన న్యాయం చేయాలని కోరుతున్నాను.

- కృష్ణ, చుట్టాల బస్తీ నివాసి

కొత్త పైపులైన్ ఏర్పాటు చేయండి



చిన్నపాటి వర్షం పడిన అడ్డగుట్ట ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్తీలో వర్షం నీరు నిలవడంతో పాటు డ్రైనేజీ నీరు రోడ్లపై పారుతుంది. పలు సార్లు సంబంధిత అధికారులకు చెప్పినా ఫలితం లేదు. అధికారులు స్పందించి కొత్త డ్రైనేజీ పైపులైన్ ఏర్పాటు చేయాలి.

- ఉదయ్‌కుమార్, అడ్డగుట్ట


అడ్డగుట్ట గంగజమునా హోటల్ ముందు మ్యాన్‌హోల్ నుంచి పొంగిపొర్లుతున్న మురుగునీరు

విద్యుత్ సమస్యలు పరిష్కరించండి

● కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్


విద్యుత్ ఉన్నతాధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

సికింద్రాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లోని వివిధ కాలనీలు, బస్తీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఎమ్మెల్యే శ్రీగణేష్ విద్యుత్ ఉన్నతాధికారులను ఆదేశించారు. పికెట్‌లోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన విద్యుత్ ఎస్ఈ గోపయ్య, డీఈ సుబ్బారెడ్డిలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బోయినపల్లిలోని కంటోన్మెంట్ ప్లేగ్రౌండ్‌లో ఇటీవల నిర్వహించిన కంటోన్మెంట్ వాణి కార్యక్రమంలో విద్యుత్ సమస్యలపై ప్రజల నుంచి చాలా ఫిర్యాదులు వచ్చాయన్నారు. కంటోన్మెంట్ వాణిలో వచ్చిన అన్నింటిని కూలంకషంగా అధ్యయనం చేసి, సత్వరమే పరిష్కరించాలని ఎమ్మెల్యే వారికి సూచించారు.

నేడు సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం..

తిరుమలగిరి: బొల్లారంలోని డౌటన్ బజార్ నుంచి తెలంగాణ తల్లి విగ్రహం వరకు నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను శనివారం ఎమ్మెల్యే శ్రీగణేష్ ప్రారంభించనున్నారు. ఈ మేరకు శుక్రవారం బోయినపల్లి మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బాలరాజు సీసీ రోడ్డు నిర్మాణ ప్రారంభ పనులను పరిశీలించారు.

23నుంచి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు


బ్రహ్మోత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఈఓ సత్యమూర్తి

రెజిమెంటల్‌బజార్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ శివాజినగర్‌లోని వేంకటేశ్వర పెరుమాళ్ ఆలయంలో ఈ నెల 23న బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ కార్యనిర్వహణాధికారి సత్యమూర్తి తెలిపారు. శుక్రవారం బ్రహ్మోత్సవాల కరపత్రాన్ని ఈఓ సత్యమూర్తి, అర్చకులు సారధి స్వామి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ, అక్టోబర్ 2 వరకు శ్రీవారి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. మొదటి రోజున అంకురార్పనతో ప్రారంభించి, 24న శేష వాహనసేవ, 25న కల్పవృక్ష వాహనసేవ, హంసవాహన సేవ, 26న గరుడవాహన సేవ, 27న హనుమత్ వాహన సేవ, సింహవాహన సేవ, 28న మోహిని అవతారం, తిరుకల్యాణం, 29న గజవాహనసేవ, 30న చంద్రప్రభ వాహన సేవ, అక్టోబర్ 1న రథోత్సవం, అశ్వవాహన సేవ, 2న చక్రస్నానం పూజలు ఉంటాయని తెలిపారు. అనంతరం సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్‌లకు ఆహ్వాన పత్రాలు అందజేశారు. అర్చకులు వెంకటేశ్వర్లు, నాగరాజు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

22 కిలోల గంజాయి పట్టివేత


కేసు వివరాలను వెల్లడిస్తున్న రైల్వే డీఎస్పీ జావెద్

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైల్వే స్టేషన్‌లో ఓ వ్యక్తి నుంచి 22 కిలోల గంజాయిని సికింద్రాబాద్ రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం రైల్వే జీఆర్పీ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రైల్వే డీఎస్పీ జావెద్, జీఆర్పీ సీఐ సాయి ఈశ్వర్‌గౌడ్‌లు వివరాలను వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అల్లూరి సీతారామరాజు జిల్లా బోండం గ్రామానికి చెందిన పూజారి శివ(20) వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నాడు. కంచెరపాలెంకు చెందిన విజయచంద్రతో పాటు ఒడిశాకు చెందిన ఆశీశ్‌కుమార్‌లతో పరిచయం ఏర్పడింది. గంజాయి సరుకు కంచెరపాలెం నుంచి ముంబయికి తీసుకెళితే ఒక టిప్పుకు రూ.ఐదు వేలు ఇస్తానని ఇద్దరు కలిసి శివతో భేరం కుదుర్చుకున్నారు. అనుకున్న పథకం ప్రకారం ఇద్దరు కలిసి శివను గంజాయి ఉన్న ప్రాంతానికి తీసుకువచ్చి 22 కిలోల గంజాయి సరుకును అప్పగించారు. గంజాయి సరుకుతో విశాఖపట్నంలో విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కాడు. శుక్రవారం ఉదయం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో గంజాయి సరుకుతో దిగిపోయి థానేకు వెళ్లడానికి కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలుకోసం ప్లాట్‌ఫాంపై నిలబడి ఉన్నాడు. ఆ సమయంలో సికింద్రాబాద్ ఆర్పీఎఫ్ సీఐ సరస్వత్‌తో పాటు ఆర్పీఎఫ్ పోలీసులు, జీఆర్పీ ఎస్ఐ రమేష్‌తో పాటు క్రైమ్ కానిస్టేబుళ్లు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ప్లాట్‌ఫాంపై ఉన్న శివ వద్దకు వెళ్లి బ్యాగు తనిఖీ చేయగా.. రూ.10.72 లక్షల విలువ చేసే 22కిలోల గంజాయి సరుకును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. మీడియా సమావేశంలో ఆర్పీఎఫ్ ఎస్ఐ త్రీమూర్తులు, రామకృష్ణలు ఉన్నారు.

త్వరలో నాలా సమస్య పరిష్కారం:మంత్రి వివేక్

బంజారాహిల్స్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): నాలా సమస్యను త్వరలోనే పరిష్కరిస్తానని మంత్రి వివేక్‌వెంకటస్వామి హామీనిచ్చారు. షేక్‌పేటడివిజన్ విరాట్‌నగర్, మినీ బృందావనం, హకీమ్‌కాలనీలలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ముంపునకు గురైన ప్రాంతాలను శుక్రవారం మేయర్ విజయలక్ష్మితో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు వరద ముంపు బాధ నుంచి శాశ్వత విముక్తి కల్పిస్తామన్నారు. ప్రజలు ధైర్యంగా ఉండాలని, ముంపు బాధిత ప్రజలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీనిచ్చారు.

మహిళ అదృశ్యం

యూసుఫ్‌గూడ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు పిల్లలతో కలిసి మహిళ అదృశ్యమైన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. యూసుఫ్ గూడకు చెందిన పి.వెంకట్రావు డ్రైవర్. ఈ నెల 16న ఆఫీస్‌కు వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చే వరకు పిల్లలు, భార్య లేదు. ఫోన్ స్విచ్ ఆఫ్ ఉంది. శుక్రవారం వెంకట్రావు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

రియల్‌ఎస్టేట్ వ్యాపారుల అరెస్ట్


మాధవి


పర్శరాములు

బోయిన్‌పల్లి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రియల్‌ఎస్టేట్ వ్యాపారం పేరుతో నకిలీ భూమి పత్రాలను సృష్టించి అమాయక ప్రజలను మోసం చేస్తున్న భార్యాభర్తలను బోయినపల్లి పోలీసులు అరెస్టు చేశారు. బోయినపల్లి సీఐ తిరుపతి రాజు, ఎస్ఐ శివశంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. నర్సింగ్‌కు చెందిన పర్శరాములు, అతని భార్య మాధవిలు స్కంద శ్రీఇన్‌ఫ్రా డెవలపర్స్ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం కొనసాగిస్తున్నారు. నకిలీ భూమి పత్రాలను సృష్టించి అమాయక ప్రజలను మోసం చేస్తూ వ్యాపారం కొనసాగిస్తున్నారు ఈ క్రమంలో సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం ఎన్కేపల్లి గ్రామంలోని సర్వే నంబర్లు 167, 167/1/2లలోని డీటీసీపీ లే అవుట్ టీఎల్‌పీ నెంబర్ 68/2024హెచ్‌కు సంబంధించి నిందితులు నకిలీ భూమి పత్రాలను తయారుచేశారు. జనవరి 2024లో బోయినపల్లి సౌజన్య కాలనీకి చెందిన రమ్యాస్ వీణ భర్త సతీష్ ఇద్దరు ఆన్‌లైన్‌లో ఆస్తుల కోసం వెతుకుతున్నప్పుడు నిందితుడిని సంప్రదించి సదాశివపేటలో రూ.13 లక్షల విలువైన ప్లాట్, అదూ విధంగా కొల్లూరు వెలిమలలో రూ.9.50 లక్షల విలువైన ఫ్లాట్ ప్రీ లాంచ్ ప్రాజెక్టు గురించి నిందితులు విచారించారు. కాగా నిందితులు నకిలీ పత్రాలను ఉపయోగించి వారికి ఆ ఆస్తులను చూపించారు. నిందితులు వారి వద్ద అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. ఒప్పందం ప్రకారం నిందితులు నిబంధనలను పాటించకపోతే ఆరు నెలల్లోపు నెలకు 2 శాతం సాధారణ వడ్డీతో రూ.22.50 లక్షలు తిరిగి చెల్లించడానికి అంగీకరించారు. వారి తప్పుడు సమాచారాన్ని నమ్మి, బాధితులు తమ బ్యాంకు ఖాతా నుంచి రూ.22.50 లక్షలు నిందితుడి ఖాతాలోకి బదిలీ చేశారు. డబ్బు అందుకున్న తర్వాత సదరు నిందితులు స్పందించడం మానేశారు. బాధితులకు ఎలాంటి ఆస్తి ప్లాట్‌లు రిజిస్ట్రేషన్ చేయలేదు. మోసపోయామని గ్రహించిన బాధితులు బోయినపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా నిందితులపై పోలీసులు కేసు నమోదు చేసి శుక్రవారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి కియా కారును స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు ఎస్ఐ శివశంకర్ తెలిపారు.


ర్యాలీలో పాల్గొన్న గాంధీ మెడికల్ కాలేజీ అధ్యాపకులు, విద్యార్థులు

గాంధీలో జాతీయ ఫార్మా కో విజిలెన్స్ వారోత్సవాలు

అడ్డగుట్ట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీ, గాంధీ ఆస్పత్రి ఆవరణలో 5వ జాతీయ ఫార్మా కో విజిలెన్స్ వారోత్సవాల కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.ఇందిర, సూపరింటెండెంట్ డా.వాణి పాల్గొన్నారు. జాతీయ ఫార్మా కో విజిలెన్స్ వారోత్సవాల కార్యక్రమంలో బాగంగా "మీ భద్రత ఒక్క క్లిక్ దూరంలో పీవీపీఐకి రిపోర్టు చేయాల"ని వారు సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గాంధీ ఆస్పత్రి డిప్యూటి సూపరింటెండెంట్ ప్రొ. సునీల్‌కుమార్, ఆర్ఎంఓ డా.శేషాద్రి, కల్యాణచక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.


రైల్వే డీఆర్ఎం కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైల్వే మజ్దూర్ యూనియన్ నేతలు

రైల్వే వేతన సంఘాన్ని ఏర్పాటు చేయాలి: శంకర్‌రావు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైల్వేలో 8వ వేతన సంఘాన్ని ఏర్పాటు చేయాలని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శంకర్‌రావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 8వ వేతన సంఘం ఏర్పాటు విషయంలో కేంద్రం జాప్యం చేయడంపై యూనియన్ నాయకులు అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం సికింద్రాబాద్ రైల్వే సంచాలన్ భవన్ ఆవరణలోని రైల్వే డీఆర్ఎం కార్యాలయం వద్ద యూనియన్ నేతలు, రైల్వే కార్మికులు, ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సికింద్రాబాద్ డివిజన్‌లో 33 రైల్వే యూనియన్ బ్రాంచీల్లో ఈ నిరసనలు చేస్తున్నామన్నారు. కేంద్రప్రభుత్వం వెంటనే స్పందించి 8వ వేతన సంఘాన్ని ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి రవీందర్, నేతలు వినాయకరావు, రాజిరెడ్డి, ఖాజా, రైల్వే ఎంప్లాయిస్ సొసైటీ అధ్యక్షుడు స్వామి తదితరులు పాల్గొన్నారు.

యువతి మిస్సింగ్ కేసు ఛేదన

రెజిమెంటల్‌బజార్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): యువతి మిస్సింగ్ కేసును మార్కెట్ పోలీసులు ఛేదించారు. ఈ నెల 1న బండిమెట్‌కు మందుల కోసం వెళ్లిన తన కూతురు మనీష(21) తిరిగి రాలేదని తల్లి మార్కెట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఆచూకీ కోసం దర్యాప్తు ప్రారంభించారు. సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. అదే విధంగా యువతి ఫోన్ లోకేషన్ ఆధారంగా మధ్యప్రదేశ్‌లోని ఛత్రాపూర్‌లో ఉన్నట్లు గుర్తించారు. సీఐ రామచందర్ ఆదేశాల మేరకు యువతి తల్లితో కలిసి ఎస్ఐ నరేశ్, కానిస్టేబుల్ మధ్యప్రదేశ్‌కు వెళ్లారు. యువతి తల్లితో రావడానికి నిరాకరించింది. దీంతో తాము వెనుదిరినట్లు పోలీసులు తెలిపారు. కాగా మోండా మార్కెట్‌లోని ఓ బట్టల షాపులో పనిచేసే యువకుడితో ఏర్పడిన పరిచయం ప్రేమకు దారితీయడంతో ఎవరికి చెప్పకుండా అమె వెళ్లిపోయిందని పోలీసుల విచారణలో తేలింది.